# సముద్రం


ప్రవీణ

**అది మే నెల కావడంతో ఎండ విపరీతంగా ఉంది. మేం వెళ్తున్నది ఏసీ కార్లోనే అయినా కూడా చెమటలు పోస్తున్నాయి. కారు అద్దాలు దింపితే కాస్త గాలన్నా తగులుతుందేమోనన్న ఉద్దేశంతో నేను కారు అద్దం కాస్త దించగానే వేగంగా కదుల్తున్న కార్లో వున్న నా చెంపపైన ఛెళ్ళున కొట్టినట్లు వేడిగాలి తగిలింది. వడదెబ్బ తగులుతుందేమోనన్న భయంతో అద్దం పైకెక్కించాను.**

ఈరోజు ప్రజ్ఞ వారపత్రిక తరపున నేను, మా జర్నలిస్టు అనూషతో కలిసి ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ పద్మశ్రీ విశాల్ గారిని ఇంటర్వ్యూ చేయడానికి వెళుతున్నాను. నేను ప్రజ్ఞ దినపత్రిక, వారపత్రిక ప్రచురణ సంస్థకు యజమానినీ, సంపాదకుణ్ని. మా తండ్రిగారు ఇంకా ఎన్నో వ్యాపార సంస్థలు నెలకొల్పినా కూడా మనకు మొదట అన్నం పెట్టిన 'ప్రజ్ఞ'ను విడువకు అని నా చేత ప్రమాణం చేయించుకున్నారు. సాధారణంగా ఇలాంటి ఇంటర్వ్యూలకు ప్రత్యేకంగా నియమింపబడ్డ జర్నలిస్ట్‌లను పంపిస్తాను. కానీ డాక్టర్ విశాల్ గారంటే నాకెంతో అభిమానం ఆ కారణంగా నేనే స్వయంగా బయలుదేరాను. నెలరోజుల నుండి ప్రయత్నం చేయగా ఈరోజుకి అప్పాయింట్‌మెంట్ దొరికింది. వారు మాకు అరగంట కేటాయించారు. ఉదయం ఏడుగంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు దేశం నలుమూలల నుండి వచ్చే పేషంట్స్‌తో వారెంతో బిజీగా ఉంటారు.

నగర శివార్లలో వున్న 'సహృదయ హార్ట్ కేర్ సెంటర్'ను నెలకొల్పడానికి డాక్టర్ వేద విశాల నారాయణరావు గారు చేసిన కృషి గణనీయము. ఈ సంవత్సరం ప్రభుత్వం డాక్టర్ గారు వైద్యవృత్తికి చేసిన సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. ఆ సందర్భంగా మేము మా వారపత్రిక కవర్ పేజీపై ఆయన ముఖచిత్రం వేసి ఇంటర్వ్యూ వివరాలను మా పాఠకులకు అందజేయాలని సంకల్పించాము. మేము హాస్పిటల్ చేరేసరికి మిట్టమధ్యాహ్నం పన్నెండున్నర అయింది. వైట్‌హౌస్‌ని పోలినట్లున్న ఆ భవనం ఎండకి ఎండి మెరుస్తూ సమున్నతంగా కనబడుతూంది. దారికిరువైపులా లాన్స్ మధ్యలో వున్న పెద్దపెద్ద చెట్ల నీడలో పేషంట్ల తాలూకు బంధువులు సేద దీరుతున్నారు. డ్రైవరు మమ్మల్ని దింపి కారును పార్కింగ్ లాట్‌కి తీసుకొని వెళ్లాడు. మేము లోపల రిసెప్షన్‌లో విజిటింగ్ కార్డు చూపించి డాక్టరు గారు టైమ్ ఇచ్చారని చెప్పాము. వారు ఒకసారి ఫోన్ చేసి ధృవీకరించుకుని అక్కడికి కాస్త దూరంలో వున్న డాక్టర్ గారి కన్సల్టింగ్ రూమ్ వైపు చూపించి అక్కడ పి.ఆర్.ఓ.ని కలవమన్నారు.

వి.వి.ఎన్. రావు అనే నేమ్ ప్లేట్ వున్న డోర్ తెరచుకుని పి.ఆర్.ఓ. లోపలికి వెళ్ళి రెండు నిమిషాల తరువాత వచ్చి మమ్మల్ని లోపలికి తీసుకొని వెళ్ళాడు. మేం వెళ్ళేసరికి డాక్టరు గారు ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆయన





మమకారం

మమ్మీ! యింకా సేపు అలాగే నిల్చోవే. మరిన్ని పాలు తాగేస్తాను.

అసిస్టెంట్ మమ్మల్ని కూర్చోమని చెప్పింది. ఒక నిమిషం తరువాత ఫోన్ పెట్టేసి విశాల్ గారు మావైపు తిరిగి చిరునవ్వుతో విష్ చేశారు. డాక్టర్ విశాల్ గారు కూర్చొని వున్నా మంచి పొడగరి అని తెలుస్తుంది. సుమారుగా ఏభై ఏళ్ళు వుండవచ్చు. స్లిమ్‌గా ట్రిమ్‌గా వున్నాడు. ఆయన కళ్ళలో అనుభవంతో నిండివున్న విజ్ఞానం తొణికిసలాడుతోంది. చెవుల వద్ద కొంచెం జుట్టు నెరిసినా దానివల్ల కూడా ఆయన హుందాగా కనిపిస్తున్నారు.

మేము వారి విలువైన సమయాన్ని వృథా చేయదలచుకోలేదు. ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రశ్నలడగసాగాను. అనూష మా సంభాషణ రికార్డు చేయసాగింది. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్య విషయాలు డా. విశాల్ గారి తండ్రి వ్యాస్ నారాయణ గారు, తల్లి విశారదాదేవి. డాక్టరుగారి జన్మస్థలం తిరుపతి. హైస్కూలు వరకు చదువు తిరుపతిలోనే సాగింది. ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ పూర్తిచేశారు. భార్యపేరు స్వర్ణలత. ఆయనకి ఒకే ఒక్క కూతురు. అమెరికాలో వుంది. ఇష్టమైన గేమ్స్ క్రికెట్, చెస్. ఇప్పటికీ కాస్త తీరిక సమయం దొరికినా టి.విలో క్రికెట్ మ్యాచ్ చూడడానికి ఇష్టపడతారు.

కాలేజీ రోజుల్లో డాక్టరు గారు హీరోలా అమ్మాయిల హృదయాల్లో ఒక వెలుగు వెలిగినా తను మాత్రం బుద్ధిగా పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నారు. ఆయన భార్య అన్నివిధాలా సహకరించడం వలన వృత్తిపరంగా ఎలాంటి ఒత్తిడి కలుగలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆయనకు నచ్చిన సినీనటులు ఎన్.టి. రామారావు గారు, అమితాబ్ బచ్చన్. ఇష్టమైన వ్యక్తులు ఇందిరాగాంధీ, బిల్‌క్లింటన్. హాబీలు బుక్‌రీడింగ్, మంచి మ్యూజిక్ వినడం. ఇలా నేనడిగిన ప్రశ్నలన్నిటికీ వారు చాలా ఓపిగ్గా సమాధానాలు చెప్పారు. చివరగా రెండు ముఖ్యమైన ప్రశ్నలు మిగిలాయి. ఇందులో మొదటి ప్రశ్న –

''డాక్టరు గారూ మీరు కేవలం గుండె చప్పుళ్ళ ద్వారా రోగ నిర్ధారణ చేయగల సమర్థులని విన్నాను. మీరు వైద్యవృత్తికీ, రోగులకు అందించిన సేవలకు ప్రభుత్వం మీకు పద్మశ్రీ పురస్కారాన్ని చాలా ఆలస్యంగా అందజేసిందని మా ఉద్దేశం. దానికి మీ అభిప్రాయం ఏమిటి? పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నందుకు మీకెలాంటి అనుభూతి కలిగిందో చెబుతారా?''

''నేనెప్పుడూ ఏ అవార్డుల కొరకు ఎదురు చూడలేదు. అటువంటప్పుడు ముందూ, వెనకా అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదుకదా! కానీ ఈ పురస్కారాన్ని అందుకోవడం నిజంగా మరపురాని మధురానుభూతి. ఇంకా కూడా వృత్తిపరంగా నేను తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది. ఇప్పటికీ నేను మెడికల్ నాలెడ్జ్ గురించి ఎన్నో బుక్స్ చదుతాను. నేను కొత్తగా తెలుసుకున్న విషయాలను లాప్‌టాప్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసుకుంటాను''.

''చివరగా ఒక ప్రశ్న. మీ వృత్తిపరంగా ఇన్నాళ్ళు మీ అనుభవంలో మీకు మరపురాని వ్యక్తులెవరైనా తారసపడ్డారా..'' అడిగాను.

ఆ ప్రశ్న ఈ ఇంటర్వ్యూకి సంబంధం లేదన్నట్లుగా అనూష నావైపు చూస్తోంది.

ఆ ప్రశ్న విన్న అతను కూడా కాసేపు మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత కాసేపటికి ''ఈ ప్రశ్న అప్రస్తుతమేమో...'' అంటూన్న అతని పెదవులు నవ్వుతున్నా సమాధానమివ్వటం ఇష్టం లేనట్లుగా ముఖకవళికలు చెప్తున్నాయి. అలా అంటూనే అతను గడియారం వంక చూశాడు.

మీకు కేటాయించిన సమయం దాటింది అని అతను చెప్పకనే చెప్పినట్లనిపించింది. నేను లేచి నిలబడ్డాను. నా దృష్టి ఒకమారు అతని టేబుల్‌పైనున్న లావాటి పుస్తకంపై పడింది. అది ప్రముఖ రచయిత్రి 'చంద్రముఖి' కలం నుండి వెలువడ్డ కొత్త నవల. ఇంటర్వ్యూలో విశాల్‌గారు బుక్ రీడింగ్ హాబీ అని చెప్పడం గుర్తుకు వచ్చింది.

అతనితో కరచాలనం చేసి 'నైస్ మీటింగ్ యూ సర్' అంటూ ఇంటర్వ్యూకి సమయం కేటాయించినందుకు 'థాంక్స్' చెప్పి అక్కడినుండి వచ్చేశాను. కానీ నా మనసులో ఎక్కడో ఓ మూల అసంతృప్తి ఎందుకంటే నేను ఆఖర్న వేసిన ప్రశ్నకు అతడెలాంటి తడబాటూ లేకుండా 'అలా ఎవరూ లేరు' అని ఉంటే నేనెక్కువ దూరం ఆలోచించేవాడ్ని కాదు. కాని అతను సమాధానం చెప్పకపోవడం వల్ల అతని గుండె లోతుల్లో ఏదో దాగివుందని అన్పించింది.

* * *

ఒక వారం తర్వాత డాక్టర్ విశాల్ గారు అనుకోకుండా నాకు మళ్ళీ కలిశారు. హైదరాబాద్ నుండి వైజాగ్ వెళ్ళే ఫ్లైటులో కలుసుకున్నాం. నా స్నేహితుడు వైజాగ్‌లో బీచ్ దగ్గర డెవలప్ చేసిన రిసార్ట్‌కి ఆహ్వానిస్తే వెళ్తున్నాను. డాక్టరు గారు అక్కడ జరిగే మెడికల్ కాన్ఫరెన్స్‌కి అటెండవడానికి వెళ్తున్నారు. నన్ను చూడగానే ఆయనే పలకరించారు. ఫ్లైట్ దిగి వెళ్ళేటప్పుడు ''మీరెక్కడ బస చేస్తున్నారు'' అడిగారు.

''డాల్ఫిన్ హోటల్లో'' చెప్పాను.

''ఓ, అయితే పరవాలేదు, నేనూ అక్కడే వుంటున్నాను. రేపు రాత్రి నాతో డిన్నర్‌కి జాయినవ్వండి'' ఆహ్వానించారు.

ఆ రాత్రి నేను వెళ్ళేసరికి విశాల్ గారు పెద్ద గ్లాస్ విండోలోంచి విద్యుద్దీపాల వెలుగుల మధ్య అందంగా కనబడుతున్న వైజాగ్ సిటీని చూస్తూ నిలబడి వున్నారు. నన్ను చూస్తూనే రండి అంటూ టేబుల్ పైకి మర్యాదగా ఆహ్వానించాడు. ఇద్దరమూ రెడ్ వైన్ ఆర్డర్ చేసి స్టాటర్స్‌లో నేను ఫ్రైడ్ చిల్లీ ఫ్రాన్స్ ఆయన ఫిష్‌ఫింగర్స్ ఆర్డర్ చేసుకున్నాము. మెయిన్ కోర్స్ తర్వాత చెప్తామని బేరర్‌కి చెప్పి మాటల్లో పడిపోయాము. సమవయస్కులమవడం వల్లనేమో కొద్దిసేపటికే ఫ్రీగా మాట్లాడుకునేటంత చనువేర్పడింది. నేను సమయం చూసి '' మీరు చంద్రముఖి గారి రచనలు చదువుతారా''.

''చదువుతాను, కానీ మీకెలా తెలుసు'' ఆశ్చర్యంగా అడిగారు.

''ఆరోజు మీ టేబుల్‌పైన ఆవిడ కొత్త ఇష్యూ చూశాను'' అన్నాను.

''ఓ అదా విషయం. నాకు చిన్నప్పటినుంచీ సాహిత్యాభిలాష బాగా వుండేది. ఇప్పటికీ తీరిక సమయాల్లో రిలాక్సింగ్‌కోసం మంచి పుస్తకాలు చదువుతాను. ముఖ్యంగా 'చంద్రముఖి' గారి ప్రతి రచనా చదువుతాను. స్త్రీ పాత్రల మనోభావాలను చాలా చక్కగా విశ్లేషిస్తారావిడ. ఆమె స్త్రీ హృదయాన్ని సముద్రంతో పోలుస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే ఆవిడ రచన పబ్లిష్ కాగానే పబ్లిషర్స్ నాకొక కాపీ విధిగా పంపుతారు. ఆవిడ రచనలకు వచ్చే రాయల్టీలో కొంతభాగం మా హాస్పిటల్‌లోని మానసిక వికలాంగుల విభాగానికి డొనేట్ చేస్తారావిడ'' అన్నారు.

''మీరెప్పుడన్నా ఆవిడని కలిశారా'' కుతూహలంగా అడిగాను.

''ప్రయత్నించాను కానీ ఆ అవకాశం కలుగలేదు. ఈమధ్య మా హాస్పిటల్లో న్యూరాలజీ విభాగం కోసం కొత్తగా నిర్మించిన భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించడానికి ప్రయత్నించాను. కానీ ఏ పబ్లిషర్ కూడా ఆమె అడ్రసు, ఫోన్ నంబరు మాకివ్వలేకపోయారు. ఎందుకంటే ఆమె తన వివరాలు ఎవరికీ తెలపొద్దని వ్రాతపూర్వకంగా హామీ తీసుకున్నారట. విచిత్రమైన వ్యక్తిత్వం'' అన్నాడు విశాల్.

ఆ తర్వాత మా మధ్య కొద్దిసేపు మౌనం. ఇంతలో స్టీవర్డ్ వచ్చి ఫుడ్ ఆర్డర్ తీసుకొని వెళ్ళాడు.

ఆరోజు ఇంటర్వ్యూలో నేనడిగి భంగపడ్డ ప్రశ్న మళ్ళీ ఒకసారి అడగాలని ధైర్యం చేయబోయే లోపల అతనే అన్నాడు.

''చూడు రాజగోపాల్ ఆరోజు మీరడిగారే. మీ జీవితంలో ఎవరైనా మరపురాని వ్యక్తిగా నిలిచిపోయారా అని. నేనారోజు సమాధానం ఎందుకు చెప్పలేదో తెలుసా? మీరు ఆరోజు మీడియా ద్వారా నా వద్దకు వచ్చారు. నేనిచ్చే జవాబుకి మీరు మసి పూసి మారేడుకాయ చేసి ప్రచురిస్తే పాఠకులు దానికి చిలువలు పలువలుగా కథలల్లుతారు. అందుకే చెప్పలేదు. నా గుండె లోతుల్లో నిక్షిప్తమైన ఈ విషయాన్ని పంచుకోవడానికి సరిఅయిన వ్యక్తి కోసం చూస్తున్నాను. మిమ్మల్ని స్నేహితునిలా భావించి చెప్పాలనుకుంటున్నాను. వినండి'' అంటూ అతడు చెప్పే విషయాన్ని నేను వింటున్నానని అనడంకంటే అందులో లీనమయ్యాననడం సబబేమో!

* * *

ఐదేళ్ళక్రితం ఒకరోజు ఉదయాన్నే ఎప్పటిలా రౌండ్స్‌కి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు డాక్టర్ విశాల్. ఇంతలో అతని సెల్ రింగయ్యింది.

''సర్ ఐ.సి.యులో ఒక ఎమర్జెన్సీ కేసు వచ్చింది. పేషెంటు గుండెనొప్పితో అడ్మిట్ అయ్యాడు. మాసివ్ అటాక్ వచ్చే సూచనలు కనబడుతున్నాయి'' అంటున్నాడు డ్యూటీ డాక్టర్.

అతను మధ్యలోనే రౌండ్స్ చేయడం విరమించుకుని వడివడిగా ఐసియు విభాగానికి చేరుకున్నాడు. అక్కడ డోర్ బదులు ఓ పక్కగా మెరుపు తీగలాంటి తనూలతతో, కాంతివంతమైన ముఖవర్చస్సు గల ఒక యువతి నిలబడి వుంది. ఆమెను ఒకసారి చూసిన వాళ్ళెవరైనా మళ్ళీ తిరిగి చూడాలనుకుంటారనడంలో సందేహం లేదు. ఆమె వంక అతను మళ్ళీ ఒకసారి చూశాడు. తెలుపు, ఆకుపచ్చ రంగుల కలయికలో వున్న దుస్తులు వేసుకుంది. ఆమె ముఖంలో చెప్పలేనంత ఆందోళన కనబడుతోంది. ఎవరో పేషెంటు తాలూకు బంధువై వుంటుంది అనుకుంటూ అతను లోపలికి వెళ్ళాడు. అక్కడ పేషెంటును చూశాడు. అతని హార్ట్‌బీట్ పల్స్‌రేట్ చెక్ చేశాడు. వెంటనే ఎల్.ఎస్.డి. ఇవ్వండి అంటూ అతడు చకచకా ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వసాగాడు. సుమారు అరగంట తర్వాత ''పరవాలేదు. ఇప్పుడు కండిషన్ స్టేబుల్‌గానే వుంది'' అంటూ పేషెంట్ వైపు పరీక్షగా చూశాడు. తెల్లగా, పొడుగ్గా ఆరోగ్యవంతమైన చర్మంతో అందంగా వున్నాడు. వయసు చిన్నదే. కేస్‌షీట్ మీద వున్న వివరాలు చదివాడు. పేరు వినయ్‌చంద్ర. నలభై సంవత్సరాలు అని వుంది.

''ఇతని తాలూకు బంధువులెవరన్నా వుంటే మాట్లాడాలి. కన్సల్టింగ్ రూమ్‌కి పంపించండి'' అంటూ వెళ్ళిపోయాడు.

కాసేపట్లో ఒక వయసు మళ్ళినతను, ఇందాక తను చూసిన యువతి లోపలికి వచ్చారు.

'కూర్చోండి' అన్నాడు.

''పరిస్థితి ఎలా వుంది డాక్టరుగారూ'' అడిగాడతను.

''ఇప్పుడు స్టేబుల్‌గానే వుంది. షి ఈజ్ వెరీ లక్కీ. సమయానికి ట్రీట్‌మెంట్ అందడం వల్ల అతనికి మాసివ్ అటాక్ రాకుండా కాపాడగలిగాం'' అలా చెప్తూ ఆమెవైపు చూశాడు. అంతవరకూ చెప్పలేనంత ఆందోళన నిండివున్న ఆమె ముఖంలో కాస్త రిలీఫ్ కన్పించింది.

''మీరు పేషెంటుకేమవుతారు'' అడిగాడు.

''నేను వినయ్ తండ్రిని, ఈమె నా కోడలు సౌమ్య వినయ్ భార్య'' అన్నాడతను.

విశాల్ ఆమె వంక చూశాడు. ఆమె వయసును అంచనా వేయడం కష్టం, చూడడానికి మాత్రం ఆమె పాతికేళ్ళ యువతిలా అన్పిస్తుంది. జరిగిన సంఘటన వల్ల ఆమె షాక్‌లో వున్నట్టుగా అన్పిస్తూంది. ఆమెనలాంటి పరిస్థితిలో చూసిన ఎవరికైనా ఆమెకు ఓదార్పునివ్వాలనిపిస్తుంది.

''మీరు ఆందోళన చెందకండి. అతను త్వరలోనే కోలుకుంటాడు. రెండు రోజులు అబ్జర్వేషన్‌లో వుంచుదాం. మీరు వెళ్ళి రెస్ట్ తీసుకోండి. ఇక్కడ అతన్ని జాగ్రత్తగా చూసుకుంటారు'' అన్నాడు.

ఆ తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారు. వెళ్ళేముందు ఆమె విశాల్‌కి కదిలీకదలని పెదాలతో నెమ్మదిగా 'థాంక్స్' చెప్పింది. ఆ మాటలు అతనికి వినబడేలోపే ఆమె కళ్ళు ఆ భావాల్ని ప్రకటించాయి. అద్భుతమైన కళ్ళు అనుకోకుండా ఉండలేకపోయాడతను.

* * *

ఆ తర్వాత మూడు రోజులకు వినయ్‌కి ఆంజియోగ్రామ్ చేసి టూవెసిల్ కరోనరీ డిసీజ్‌గా నిరారణ చేశారు. పిడివి శాఖలో తొంభైశాతం బ్లాకేజీ వుండడం వల్ల వీలయినంత త్వరలో బైపాస్ సర్జరీ చేయాల్సి వస్తుంది.

తన భర్తకు బైపాస్ సర్జరీ చెయ్యాలి అన్న మాట విన్న ఆమె వేటగాడి బాణం దెబ్బతిని విలవిలలాడుతున్న పక్షిలా తల్లడిల్లిపోయింది. ఈరోజుల్లో బైపాస్ సర్జరీలో పెద్దగా రిస్క్ ఏమీ వుండదని, సర్జరీ తరువాత వినయ్ నార్మల్ రొటీన్ లైఫ్‌కి ఎలాంటి అవాంతరాలూ వుండవని వివరించి ఎంతగానో కన్విన్స్ చేశాక సర్జరీ జరగడానికి అంగీకరించింది.

వినయ్‌కి ఆపరేషన్ సక్సెస్ అయింది. అతను త్వరగా కోలుకోసాగాడు. వాళ్ళు సుమారు పాతిక రోజులు హాస్పిటల్‌లో వున్నారు. డాక్టర్ విశాల్ రోజూ ఉదయం, సాయంత్రం రౌండ్స్‌లో విధిగా వినయ్‌ను చూడటానికి వెళ్ళేవాడు. అక్కడ ఎప్పటికీ వినయ్‌ని కంటికి రెప్పలా సంరక్షిస్తున్నట్లుగా సౌమ్య వుండేది. ఆమె నోరు విప్పి ఎక్కువగా మాట్లాడేది కాదు. కానీ ఆమె కళ్ళే అతన్ని పలకరించేవి. కళ్ళతోనే ప్రశ్నలు కురిపించేది. తను వినయ్‌ని చెకప్ చెయ్యగానే ఆమె కళ్ళల్లో ఎలా వుంది? అనే ప్రశ్న కనబడేది. అడగాల్సిన సందేహాలన్నీ వినయ్ అడిగేవాడు. సమాధానాలు మాత్రం ఆమె శ్రద్ధగా వినేది. ఇన్నాళ్ళుగా వాళ్ళని గమనిస్తున్న డాక్టర్ విశాల్‌కి వాళ్ళ వస్త్రధారణలో, దినచర్యలోని అలవాట్లలో, ప్రవర్తనలో, మాట్లాడే సరళిలో రిచ్‌నెస్ బాగా కనిపించేది. విశాల్‌కెందుకో వాళ్ళ జీవితాలలోకి తొంగిచూడాలన్న కుతూహలం కలిగింది. అందమైన యుగళగీతంలా సాగుతున్న వాళ్ళ జీవనయాత్రలో వినయ్‌కి అకస్మాత్తుగా వచ్చిన గుండెజబ్బు సౌమ్యలో భయంకరమైన కలవరాన్ని కలిగించింది. పోస్ట్ ఆపరేటివ్ కేర్‌లో ఆమె భర్త ఆరోగ్యంలో ఏ చిన్న మార్పు వచ్చినా ఆమె విశాల్ కన్సల్టింగ్ రూమ్‌కి పరుగెత్తుకొని వచ్చేది. విశాల్ మొదటినుంచీ వినయ్ కేసు పట్ల శ్రద్ధ చూపించడం గమనించిన స్టాఫ్ ఎవరూ ఆమెను ఆటంకపరిచేవారు కాదు. కానీ విశాల్ గారి అసిస్టెంట్ మాత్రం కాస్త చిరాకుపడుతూ ''సర్. ఆమె మరీ అతిగా వర్రీ అవుతారనిపిస్తుంది. ప్రతి చిన్న విషయానికీ మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తుంది. ఆమెకేమీ పనిలేకపోవడం వల్ల పూర్తిగా ఒకరిపై ఆధారపడే మనస్తత్వం వుండడం వల్ల ఇలా ప్రవర్తిస్తుందేమో?'' అన్నది.

ఆమె మాటల్లో చులకనభావం వున్నా కొంతలో కొంత నిజం లేకపోలేదు. ఆమెలో అమాయకత్వం,

**ఓ పక్కగా మెరుపు తీగలాంటి తనూలతతో, కాంతివంతమైన ముఖవర్చస్సు గల ఒక యువతి నిలబడి వుంది. ఆమెను ఒకసారి చూసిన వాళ్ళెవరైనా మళ్ళీ తిరిగి చూడాలనుకుంటారనడంలో సందేహం లేదు. ఆమె వంక అతను మళ్ళీ ఒకసారి చూశాడు. తెలుపు, ఆకుపచ్చ రంగుల కలయికలో వున్న దుస్తులు వేసుకుంది.**

ఆధారపడే తత్వం, మెడికల్ నాలెడ్జి కొరవడడం, తన కుటుంబం అనే అతిచిన్న పరిధిలో ఇమిడిపోయే తత్వం గల ఆమెలో ఈ సమస్య ఒకలాంటి ఇన్‌సెక్యూరిటీ భావాన్ని కలుగచేయడం వల్ల ఆమె మానసిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది అనుకున్నాడతను. ఒక డాక్టరుగా అతనూ అతనితో పాటుగా వున్న డాక్టర్ల బృందం ఆమె మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని ఆమె మామూలు మనిషి కావడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది.

ఒకరోజు ఉదయాన్నే ఎప్పటిలా విశాల్ వినయ్ గదిలోకి వెళ్ళి వస్తూండగా ఆమె అతనికి గ్రీటింగ్ కార్డ్, తెలుపు కార్నిషన్స్, లేత గులాబీరంగు రోజెస్‌తో చేసిన చిన్న అందమైన బొకేని ఇస్తూ ''మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే డాక్టర్‌గారూ'' గులాబీ రంగు దుస్తుల్లో అతి మనోహరంగా కన్పిస్తూ అందమైన చిరునవ్వుతో అన్నది.

ఆరోజు డాక్టర్ విశాల్ బర్త్‌డే. హాస్పిటల్‌కి

ఎం.డి. అయిన అతని పుట్టినరోజు కావడం వల్ల హాస్పిటల్ స్టాఫ్ కాస్త హడావిడి చేసి ఎంట్రన్స్ వద్ద, అతని కన్సల్టింగ్ రూమ్‌లోనూ పెద్దపెద్ద ఫ్లవర్ బొకేలు అరేంజ్ చేసి స్వాగతం పలికారు. సౌమ్యకి స్టాఫ్ ద్వారా ఈ విషయం తెలిసినట్లుంది.

విశాల్ ఆమెకు థాంక్స్ చెప్పి ఆ కార్డు, బొకేలను తన అసిస్టెంట్ చేతికిచ్చాడు.

విరామ సమయంలో తన టేబుల్‌పైనున్న కార్డ్‌ని కుతూహలంగా తెరిచాడు. అందులో ఒక వైపు శుభాకాంక్షలు తెలుపుతూ మరోవైపు ముత్యాల్లాంటి అక్షరాలతో ఇలా రాసుంది.

డాక్టర్ విశాల్ గారికి,

నేను నా భర్తనూ, తల్లిదండ్రులనూ, నా ఇద్దరు పిల్లలనూ అమితంగా ప్రేమిస్తాను. అలాగే ఆ పరిమితమైన జాబితాలో మిమ్మల్నీ కలిపాను. కానీ వాళ్ళలా మనమధ్య ఎటువంటి బంధమూ, రక్త సంబంధమూ లేదు. పోనీ స్నేహితుడిగా స్నేహ బంధాన్ని తగిలించి నా మనసులోని మీ స్థానాన్ని

"

**ఆమె ముఖం చంద్రునిలా కాంతివంతంగా మెరిసిపోయేదని చిన్నప్పుడు వాళ్ళ అమ్మమ్మగారు చంద్రముఖి అని పిలిచేది. ఆవిడ గుర్తుగా ఆ పేరు చిరస్థాయిగా నిలిచి వుండాలని తన రచనలు చంద్రముఖి పేరు మీద చేస్తుంది**

"

కించపరచలేను. అలాగని ఆరాధ్యదైవమనే సెంటిమెంట్‌తో కూడిన పదంతో మరీ దూరాన నిలబెట్టలేను. అన్ని బంధాలకూ, భాషలకూ అందని అతీతమైన అపురూపమైన భావం అది. మహాసముద్రంలో లెక్కలేనన్ని నీటి బిందువులున్నట్లే ఈ వృత్తిలో నాలాంటి వాళ్ళెందరో మీకు తారసపడుతూండవచ్చు. కొద్దిరోజుల్లో మీరు నన్ను పూర్తిగా మర్చిపోవచ్చు. కానీ నా మనసులో మాత్రం నా జీవితాన్ని నిలబెట్టిన మీ స్థానం ఎప్పటికీ చెక్కుచెదరదు.

– సౌమ్య

ఆ తర్వాత రెండు మూడు రోజుల్లో వాళ్ళు డిశ్చార్జ్ అయ్యి వెళ్ళిపోయారు. డాక్టర్ విశాల్‌కెందుకో హాస్పిటల్ అంతా శూన్యంగా అన్పించింది. వాళ్ళు ఆమధ్యలో నెలకొకసారన్నా కొన్ని నెలలపాటు రొటీన్ చెకప్‌కి వచ్చేవాళ్ళు. ఆ తర్వాత వృత్తిరీత్యా వినయ్ లండన్ వెళ్ళాల్సి రావడంతో వెళ్ళేముందు విశాల్‌ని కలిసి వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయారు. ఎవరో ఆత్మీయులు తనని విడిచి వెళ్ళినంత బాధ కలిగింది అతనికి. ఇంతలో బేరర్ బిల్లు తేవడంతో చెబుతున్న అతను, వింటూన్న నేనూ ఈ లోకంలోకి వచ్చాము.

ఆ తరువాత విశాల్ ''మనం అలా సముద్రం ఒడ్డుకు వెళ్ళి మాట్లాడుకుందాం'' అంటూ దారితీశాడు. అతడు మళ్ళీ చెప్పసాగాడు. ''భర్త పూర్తిగా కోలుకున్న తరువాత ఆమె కళ్ళలో కనబడే మెరుపు, ముఖంలో కనబడే సంతోషం నా మనసుకెంతో ఆహ్లాదం కలిగించేది. వాటికి నేనే కారణం అన్న గర్వం కూడా నాలో కలిగేది. ఇలా పేషెంట్లూ, వాళ్ల తాలూకు బంధువులూ మాపట్ల చూపించే నమ్మకం మేం ఈ వృత్తివల్ల ఆర్జించే ధనంకంటే ఎక్కువ తృప్తిని కలిగిస్తుంది.''

''ఇప్పటికీ రోజూ నేను రౌండ్స్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళు వుండి వెళ్ళిన గదివైపు నా కళ్ళు కదులుతాయి. అక్కడింకెవరో కొత్త పేషెంటు వున్నా కూడా నా కళ్ళు ఆ గదిలో ఆమె జ్ఞాపకాలకోసం వెతుకుతాయి. హాస్పిటల్‌లో నేను తిరుగుతున్నప్పుడు ఎక్కడైనా, ఎప్పుడైనా ఆ కాంతివంతమైన చంద్రబింబం లాంటి ముఖం తారసపడుతుందేమోనన్న భ్రమ నన్ను వెంటాడుతుంది. కన్సల్టింగ్ రూమ్ డోర్ తెరుచుకుని ఆమె వస్తుందేమో అన్నట్లుగా భ్రమ కలుగుతుంది. ఇన్నేళ్ళయినా నాలో ఆ జ్ఞాపకాలు చెక్కుచెదరలేదు.

నిజంగానే సౌమ్య చెప్పినట్లుగా ఇది అన్ని బంధాలకూ అతీతమైన అపురూపమైన భావం, దీన్ని వర్ణించడానికి ఏ భాషలోనూ సరిఅయిన పదాలు దొరకవు అన్నాడు విశాల్ దీర్ఘంగా నిశ్వసిస్తూ.

నేను సముద్రం వైపు చూస్తూ అతడు చెప్పేది వింటున్నాను.

అనంతమైన సముద్రం నిండు చంద్రకాంతి తనపైన ప్రసరిస్తుండగా హోరున శబ్దం చేస్తూ నురగలు కక్కుతూ ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఆ చంద్రబింబాన్ని అందుకోవాలని తాపత్రయపడుతున్నట్లుగా వుంది. నేనా దృశ్యంలోని అందాన్ని ఆస్వాదిస్తూ అతను చెప్పింది ఆసాంతం విని ''మీరు చెప్పినదాంట్లో ఒక్క విషయం మాత్రం నిజంకాదు'' అన్నాడు.

విశాల్ ఏమిటన్నట్లుగా చూశాడు.

''మీ అసిస్టెంట్ అన్నట్లుగా, మీరనుకున్నట్లుగా సౌమ్యకి పనిలేకపోవడం, కేవలం భర్తపైనే ఆధారపడడం, అమాయకత్వం, మెడికల్ నాలెడ్జీ లేకపోవడం ఇవన్నీ మీరు తప్పుగా ఊహించారు. తన భర్తకు ప్రాణాపాయం వుందన్న విషయం తెలిసిన ఏ స్త్రీ అయినా ఆమె సాధారణ గృహిణి అయినా, డాక్టరైనా అలాగే ప్రవర్తిస్తారేమో. ఎంత మెడికల్ నాలెడ్జీ ఉన్నా, ఈరోజుల్లో టెక్నాలజీ ఎంత పురోగమించినా, అదృష్టం వెన్నంటి దురదృష్టం అనేది ఒకటి వుంటుందనీ, అది తననుండి తన భర్తను దూరం చేస్తుందేమోనన్న వెరుపు వల్ల సౌమ్య అంతలా భయపడిందేమో! ఆ పరిస్థితిలో ఎంత గుండె నిబ్బరం కలవాళ్ళైనా అలాగే ప్రవర్తిస్తారు. నాకందులో అసహజమేమీ అనిపించలేదు. ఇంకో విషయమేమంటే సౌమ్య ఎవరో కాదు ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లో తన రచనలతో పాఠకులను అలరిస్తూ అత్యధిక రెమ్యూనరేషన్, రాయల్టీలు పొందుతూ వాటిల్లో సగభాగం మానసిక వికలాంగుల సేవకు డొనేట్ చేసి సద్వినియోగపరిచే ప్రముఖ రచయిత్రి చంద్రముఖి'' అన్నాను ఆవేశంగా.

అతను నమ్మశక్యం కానట్లుగా చూస్తూ. సౌమ్య, వ్వా...ట్ సౌమ్య రైటరా.. కానీ పేరు.. అర్థోక్తిగా ఆగిపోయాడు.

''ఆమె ముఖం చంద్రునిలా కాంతివంతంగా మెరిసిపోయేదని చిన్నప్పుడు వాళ్ళ అమ్మమ్మగారు చంద్రముఖి అని పిలిచేది. ఆవిడ గుర్తుగా ఆ పేరు చిరస్థాయిగా నిలిచి వుండాలని తన రచనలు చంద్రముఖి పేరు మీద చేస్తుంది'' అని చెప్పాను.

నేను చెప్పింది విని కూడా అతనింకా నమ్మలేనట్లు నా దగ్గరకు వచ్చి నా చేతులు పట్టుకుంటూ ''ఇది.. ఇది నిజమా... మీకెలా తెలుసు'' అన్నాడు.

''ఎలా అంటే సౌమ్య నా చెల్లెలు కాబట్టి''. నా పెదాల వరకు వచ్చిన ఆ మాటల్ని మింగేశాను. సౌమ్య భర్త వినయ్‌కి సర్జరీ అయిన సమయంలో నేనూ, నా భార్య అమెరికా ట్రిప్‌లో వున్నాము. మేము తిరిగొచ్చిన తరువాత విషయం తెలిసింది. సౌమ్య తనతో జరిగిందంతా చెప్పింది. ఆ సమయంలో తను పడ్డ మానసిక వ్యధను గమనించి డాక్టర్ విశాల్ తన పట్ల చూపించిన శ్రద్ధ, ఇచ్చిన మారల్ సపోర్ట్‌ని వివరిస్తున్నప్పుడు ఆమె ముఖం దీప్తివంతమైనట్లు గమనించాను. అందుకే సౌమ్య అతనికి గుర్తుందో లేదో తెలుసుకోవాలనే ఆరోజు ఇంటర్వ్యూలో ఆ ప్రశ్న అడిగాను. నాకిప్పుడు కావల్సిన సమాధానం దొరికింది. కానీ అతని పర్సనల్, కాన్ఫిడెన్షియల్ విషయమైన సౌమ్య గురించి నాతో ఫ్రీగా చెప్పుకున్నప్పుడు నాకెందుకో సౌమ్య నా చెల్లెలని విశాల్‌కి చెప్పడం నాకిష్టం లేదు.

''నేను ఒక పత్రికా సంస్థకు యజమానినన్న విషయం మరచిపోతున్నట్లున్నారు. మా పత్రికలో ఆమె రచనలెన్నో ప్రచురించాము. ఆమె వివరాలు వెల్లడించబోమని హామీ ఇచ్చినా, మిమ్మల్ని ఒక స్నేహితునిలా భావించి మీకు చెప్పాను'' అన్నాను.

ఆ మాటలతో అతనికి నమ్మకం కలిగినట్లుంది. అతని ముఖంలో చిరునవ్వు ఉదయించింది.

''ఆ అమాయకంగా కనిపించే పెద్దపెద్ద కళ్ళు గల ఆ ముఖం, భయంగా కంగారుగా చూసే ఆ చూపుల వెనుక అంతటి సృజనాత్మకత, కలమనే ఆయుధంతో స్త్రీల హక్కుల గురించి పోరాడే శక్తి దాగుందా! సమన్వయంతో స్త్రీ సమస్యలకు పరిష్కారం చూపించే నేర్పు ఇమిడి వుందా? నిజమే చంద్రముఖి చెప్పినట్లు స్త్రీ హృదయం సముద్రం లాంటిదే అని నేను ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను. గుండె చప్పుళ్ళ ద్వారా గుండె జబ్బులు నిర్ధారించడంలో నిష్ణాతుడ్నని గర్విస్తున్న నేను గుండె లోతుల్ని స్పృశించడం తెలియని అమాయకత్వం నాలో వుందని ఇప్పుడే గ్రహించాను'' అంటూన్న అతని ముఖం చంద్రకాంతితో ఎంతో ఆహ్లాదంగా కన్పించసాగింది. చంద్రకాంతిలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సముద్రంవైపూ, అతనివైపూ మార్చి మార్చి చూడసాగాను.

★